నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 19: రాష్ట్రస్థాయి సోషల్ వెల్ఫేర్ బాలుర క్రీడాపోటీలు మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) సోషల్ వెల్ఫేర్ పాఠశాల/కళాశాల క్రీడామైదానంలో గురువారం నుంచి ఈ నెల 21 వరకు జరగనున్నాయి. ఏర్పాట్లను క్రీడాపోటీల జిల్లా జోనల్ అధికారి స్వరూపరాణి పరిశీలించారు. రాష్ట్రంలోని కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి, జోగులాంబ, చార్మినార్ జోన్ల నుంచి 1359 మంది క్రీడాకారులు పాల్గొంటారు. అండర్-14,17,19 విభాగాల్లో 11 రకాల పోటీలు ఉంటాయి. ఫుట్‌బాల్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టారు. ఈ పోటీల నిర్వహణకు 13 కమిటీలు ఏర్పాటయ్యాయి. పోటీల పోస్టర్‌ను అధికారులు బుధవారం ఆవిష్కరించారు.

వెయిట్ లిఫ్టింగ్ జిల్లా జట్టు ఎంపిక

ఇల్లెందు, డిసెంబర్ 18: రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ బుధవారం స్థానిక జేకే కాలనీ సీఈఆర్ క్లబ్‌లో ఎంపిక చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు తమ్మిశెట్టి మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన జట్టు ఎంపిక పోటీలను 11వ వార్డు కౌన్సిలర్ చెరుకుపాటి శ్రీను ప్రారంభించారు. అండర్-20 యువతీయువకుల విభాగంలో 12 మంది ఎంపికయ్యారు.

సెక్స్ వర్కర్లను గుర్తించాలి

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రోజు రోజుకూ పెరుగుతున్న ఎయిడ్స్ మహమ్మారిని నియంత్రణకు ముందస్తుగా సెక్స్ వర్కర్లను గుర్తించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ అన్నారు. ఎయిడ్స్ నివారణకు తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ సమావేశం బుధవారం ఐడీఓసీలో జరిగింది. డాక్టర్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ.. ఎయిడ్స్ నియంత్రణకు జిల్లావ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ఈ నెల 20 నుంచి సర్వే ప్రోగ్రాం ఉంటుందని చెప్పారు.

మునగ సాగుతో జీవనోపాధి

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 18: మునగ సాగుతో జీవనోపాధి లభిస్తుందని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని గాండ్లగూడెంలో మునగ సాగును బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 15 ఎకరాలలో మునగ సాగవుతున్నదని చెప్పారు. మునగ కాయలు, ఆకులు, కాయ పై పొట్టు, ఎండిన మునగ కాయలు.. బయో ఉత్పత్తులకు ఉపయోగపడతాయన్నారు. మునగలో వ్యర్థం అనేది ఏమీ ఉండదని చెప్పారు.

ఇల్లెందులోకి భారీ వాహనాలకు అనుమతి నిరాకరణ

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 18: ఇల్లెందులోకి భారీ వాహనాలు ప్రవేశించడానికి అనుమతి లేదని సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కరెంటాఫీస్, గోవింద్ సెంటర్, జగదాంబ సెంటర్ ఏరియాల్లో నో ఎంట్రీ హెచ్చరిక బోర్డులను బుధవారం ఏర్పాటు చేశారు. ఉదయం 8.00 నుంచి రాత్రి 10.00 గంటల వరకు భారీ వాహనాలకు ఇల్లెందు పట్టణంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇల్లెందులో ప్రవేశానికి టిప్పర్లకు ఎటువంటి అనుమతి లేదని స్పష్టం చేశారు.

ఎలక్ట్రిక బ్యాటరీలు అందజేత

భద్రాచలం, డిసెంబర్ 18: పట్టణంలో దివ్యాంగురాలు తెల్లప్రగడ శేషకుమారి, నల్లబోతుల రాణికి ప్రభుత్వం రెండేళ్ల క్రితం త్రీవీలర్ ఎలక్ట్రికల్ వాహనాలు ఇచ్చింది. బ్యాటరీలు కొనుగోలు చేయకపోవడంతో వాహనాలు మూలనపడ్డాయి. సామాజిక మాధ్యమం ద్వారా విషయం తెలుసుకున్న పలువురు స్పందించి రూ.15వేలు ఇవ్వడంతో 4 కొత్త బ్యాటరీలు కొనుగోలు చేసి కంభంపాటి సురేష్, యశోద నగేష్ చేతులమీదుగా బుధవారం దివ్యాంగులకు బ్యాటరీలను అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్గంపహాడ్, డిసెంబర్ 18: ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు ఐటీసీలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండలంలోని కృష్ణసాగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ధర్మాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తార్నాకలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో ఐటీఐ పూర్తిచేసిన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్, కెమికల్ ల్యాబ్ అసిస్టెంట్, ఏసీ మెకానిక్, మోటార్ వెహికల్, డ్రాఫ్స్‌మెన్ సివిల్ పాసైన విద్యార్థులు కృష్ణసాగర్ ఐటీఐకు సంప్రదించాలని, వివరాలకు 8919961618ను సంప్రదించాలని కోరారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

అమ్మకం

★శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ సత్తుపల్లి బ్రాంచి వారి ఈ క్రింది వాహనములు అమ్మకమునకు కలవు. TS28T5499 TATA LPT 3718 - 2017, AP07 TJ-2547 TATA LPT 3718 -2018, AP39U - 7405 TATA LPT 3718-2019, TS28T - 7111 TATA LPT 3718 -2018, AP39T -8349 TATA LPT 4223 -2019, TS07UE -8586 TATA LPT 3118 -2018, TS29B -8152 ZEST 1.3L XE DIS 5 SET -2017, TS28TA -1125 TATA ULTRA 1518 -2019, AP16TE 6523 TATA LPT 3718 -2017, AP21TE 6363 TATA LPT 4223 -2018, TS04UA 1396 TATA ACE - 2014, TS04UA -1735 M/M 475 DI -2014, AP01Y -7992 TATA LPT 3118 -2013 ప్రకటన తేదీ నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును.
సంప్ర: 9666382345, 9000014364
KMM

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

CHANGE OF NAME

★I, **BUTTI KIRAN KUMAR**, S/O. **BUTTI NAGESWARA RAO** (OLD NAME), R/o. H.No.10119, Singabhupalem Village, Sujathanagar Mandal, BHADRADRI KOTHAGUDEM DIST-507120, TELANGANA. Changed my Father's name as **BUTTI ABRAHAM** (NEW NAME).
-KMM

CHANGE OF NAME

★I, **KONDA SANTHOSH KUMAR** (OLD NAME) R/o. H.No.16-3-55, Nagaiahgadda, Ramavaram, Kothagudem Mandal, BHADRADRI KOTHAGUDEM DIST-507115, TELANGANA. Changed my name as **KONDA SANTOSH KUMAR** (NEW NAME) S/O. Konda Rajaiah.
-KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పూసుకుంటలో వసతుల కల్పనకు దృష్టి

ఐటీడీఏ పీవో రాహుల్

అధికారులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, డిసెంబర్ 18: దమ్మపేట మండలంలోని పూసుకుంట గ్రామంలో నివసించే కొండరెడ్ల గిరిజనులకు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తామని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. బుధవారం ఐటీడీఏలోని చాంబర్‌లో హార్టికల్చర్, అగ్రికల్చర్, కరెంటు, ఫారెస్టు అధికారులతో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండరెడ్ల గ్రామంలో గిరిజనులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా రోడ్డు సౌకర్యంతో పాటు వ్యవసాయానికి కరెంటు సదుపాయం, ఇతరత్రా మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నీటివసతికి గ్రామంలో బోర్లు వేయించాలని, సాగుకు గిరిజన రైతులకు ఐటీడీఏ ద్వారా మోటార్లు అందిస్తామని, కరెంటు సరఫరాకు సబ్సిడీ 70 శాతం ఉన్నందున 30 శాతం ఐటీడీఏ చెల్లించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో మంత్రి ఆదేశాల మేరకు పూసుకుంటలో కొండరెడ్ల గిరిజనుల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో డేవిడ్‌రాజ్, కరెంటు ఎస్‌ఈ మహేందర్‌రెడ్డి, ఏడీ వెంకటరత్నం, జిల్లా ఉద్యానశాఖాధికారి కిశోర్, డీఏవో బాపూరావు పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుతో లాభాల 'పంట'

మాట్లాడుతున్న కిశోర్

దమ్మపేట, డిసెంబర్ 18: ఆయిల్‌పాం సాగుతో లాభాల 'పంట' పండుతుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జె.కిషోర్ అన్నారు. ఆయిల్‌పాం సాగుపై మండలంలోని పూసుకుంటలో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగుతో కలిగే ప్రయోజనాలను, లాభాలను, ప్రభుత్వం ఇచ్చే రాయితీలపై అవగాహన కల్పించారు. సమీపంలోనే పామాయిల్ ఫ్యాక్టరీ ఉన్నందున పామాయిల్ గెలల రవాణాకు, మార్కెట్‌కు ఇబ్బంది ఉండదన్నారు. ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ బాలకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి సందీప్, వ్యవసాయ విస్తరణాధికారి కేశవ, ఆయిల్‌పాం ఫీల్డ్ ఆఫీసర్లు అప్పారావు, సతీష్, డ్రిప్ కంపెనీ జిల్లా అధికారి నర్సింహారావు పాల్గొన్నారు.

లీస్ హెడ్ క్వార్టర్స్‌లో క్రిస్మస్ వేడుకలు

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 18: పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అధికారులు, సిబ్బంది కలిసి బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ఎస్పీ బిరుదరాజు రోహిత్ పాల్గొన్నారు. ఆయన కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించి, శుభాకాంక్షలు తెలిపారు.

బూర్గంపహాడ్, డిసెంబర్ 18: క్రీస్తు చూపిన ప్రేమను ప్రజలందరికీ పంచాలని షిలోహు మిషనరీ వ్యవస్థాపకులు, పాస్టర్ మోజెస్ ములక అన్నారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన షిలోహు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సారపాక సియోను ప్రేయర్ హౌస్ మందిరంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు.

ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): దేశీ బ్యాచ్ (2024-25) ఇన్‌పుట్ డీలర్లకు బుధవారం చుంచుపల్లి మండలం రామవరం రైతు వేదికలో శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు నిర్వహించారు. నత్రజని ఎరువు వాడకం, యూరియా ఎరువు తగ్గించడం, జీవన ఎరువు అజోల్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఫెసిలిటేటర్లు డేవిడ్ జైపాల్‌రావు, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్ ర్యాలీ

దమ్మపేట, డిసెంబర్ 18: దమ్మపేటలో బుధవారం పోలీసులు, విద్యార్థులు కలిసి ఎస్సై సాయికిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ర్యాలీ నిర్వహించారు. 'మత్తుకు బానిసలుగా కావొద్దు', 'కుటుంబాలను నాశనం చేసుకోవద్దు' అని నినాదాలిస్తూ ర్యాలీ సాగింది.

ద్విచక్ర వాహనం చోరీ

అశ్వారావుపేట, డిసెంబర్ 18: మండలంలోని అల్లిగూడెం గ్రామస్తుడు రవీంద్రబాబు మంగళవారం ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పనులకు వెళ్లాడు. సాయంత్రం పని ముగించుకుని వచ్చేసరికి పార్క్ చేసిన ప్రదేశంలో ఆ వాహనం కనిపించలేదు. తన వాహనాన్ని ఎవరో చోరీ చేసినట్లుగా ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై యయాతి రాజు కేసు నమోదు చేశారు.

శిక్షణా తరగతులు ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 18: సింగరేణి ఎస్ అండ్ పీసీ సెక్యూరిటీ సిబ్బందికి 33వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులు బుధవారం కార్పొరేట్‌లోని ట్రైనింగ్ సెంటర్‌లో జీఎం (సెక్యూరిటీ) సిహెచ్.లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఎస్ఎస్‌వో జాకీర్ హుస్సేన్, ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ ఆటోలకు 'బ్రేక్'

నిలిచిపోయిన స్వచ్ఛ ఆటోలు

పాల్వంచ, డిసెంబర్ 18: పట్టణంలో వారం రోజుల నుంచి ఇంటింటి నుంచి చెత్త సేకరణ నిలిచిపోయింది. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను శ్రీనివాస కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డులోకి తీసుకెళ్లి తగలబెడుతున్నారు. ఇక్కడి నుంచి వస్తున్న పొగ, ధూళి, దుర్వాసనతో ములకలపల్లి, దమ్మపేట వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు ఇబ్బంది కలుగుతున్నది. దీనిపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్కడ డంపింగ్ ఆగింది. పాత పాల్వంచ-బంగారుజాల మార్గంలో మొర్రేడు వాగును ఆనుకుని చెత్తను పోస్తున్నారు. దీనిపై చుట్టపక్కల వ్యవసాయదారులు ఆందోళనకు దిగడంతో అక్కడ కూడా చెత్త డంపింగ్ ఆగింది. చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోలకు వారం రోజులుగా బ్రేకులు పడ్డాయి. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావును వివరణ కోరగా.. ''మున్సిపల్ కమిషనర్ సహా అందరం కలిసి అనువైన డంపింగ్ యార్డు ఏర్పాటు అన్వేషణలో ఉన్నాం. ఈ సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది'' అని చెప్పారు.

దుప్పట్లు పంపిణీ

కొత్తగూడెం క్రైం/కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 18: కొత్తగూడెంలోని యాచకులకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ సమకూర్చిన దుప్పట్లను కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ బుధవారం పంపిణీ చేశారు. వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, ఫ్రెండ్స్ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీకాంత్, మెరుగు చింటు, శివ, సిద్ధు, కౌశిక్, నవీన్, సుమంత్, శ్రీను పాల్గొన్నారు.

దిబ్బగూడెంలో రగ్గులు..

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 18: మండలంలోని దిబ్బగూడెం గ్రామంలో 40 కుటుంబాలకు రగ్గులను సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కొనకళ్ల సుధారాణి బుధవారం పంపిణీ చేశారు.

ఇల్లెందులో నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

ఇల్లెందు, డిసెంబర్ 18: సీపీఎం జిల్లా మూడవ మహాసభలు ఇల్లెందు పట్టణంలో గురువారం ప్రారంభమవుతాయి. స్థానిక ఏలూరి భవనంలో బుధవారం పార్టీ సమావేశంలో రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్ మాట్లాడుతూ.. ఈ మహాసభలను శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు ఎస్.వీరయ్య, పోతినేని సుదర్శన్, పి.సోమయ్య పాల్గొంటారని చెప్పారు.

గార్లలో ఏఐకేఎంఎస్ రాజకీయ తరగతులు

టేకులపల్లి, డిసెంబర్ 18: ఏఐకేఎంఎస్ రాష్ట్ర స్థాయి రాజకీయ తరగతులు ఈ నెల 20, 21 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా గార్లలో జరుగుతాయని జిల్లా నాయకుడు భూక్యా హర్జ్య తెలిపారు. టేకులపల్లిలో బుధవారం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ తరగతులను జయప్రదం చేయాలన్నారు.

నర్సరీల సందర్శన

జూలూరుపాడు, డిసెంబర్ 18: జూలూరుపాడు రేంజ్ పరిధిలోని నర్సరీలను కొత్తగూడెం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ యు.కోటేశ్వరరావు బుధవారం సందర్శించారు.వినోభానగర్, జూలూరుపాడు నర్సరీల్లోని మట్టి బ్యాగులను, రాజారావుపేట సమీపంలోని ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఎఫ్ఆర్‌వో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 18: మండలంలోని మసివాగులో విత్తనాల నర్సరీని ఎంపీవో చిరంజీవి బుధవారం పరిశీలించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

టేకులపల్లి, డిసెంబర్ 18: మండలంలోని గంగారం పంచాయతీ సంపత్‌నగర్ గ్రామస్తుడు కుంపటి సురేష్‌ది నిరుపేద కుటుంబం. అతడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి స్థానిక నాయకుడు కోరం సురేందర్ బుధవారం రూ.30,000 సాయంగా అందించారు. స్థానిక నాయకులు కృష్ణ, రామనాథం, బెంజ్ రావు, నరేష్, ఈది గణేష్, రవి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ టీచర్ల సమ్మె నోటీస్

టేకులపల్లి, డిసెంబర్ 18: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలోని కాంట్రాక్ట్ టీచర్లు తమ కు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20, 21 తేదీల్లో సమ్మె చేయనున్నారు. తమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వారు బుధవారం ఐటీడీఏ భద్రాచలం డిప్యూటీ డైరెక్టర్(ట్రైబల్ వెల్ఫేర్) మణెమ్మకు నోటీస్ ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బయాలజీ రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపిక

టేకులపల్లి, డిసెంబర్ 18: కొత్తగూడెంలో బుధవారం జిల్లా స్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్ జరిగింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గీత.. ద్వితీయ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి టెస్టుకు ఎంపికైంది. నిర్వాహకుల నుంచి సర్టిఫికెట్ అందుకుంది. ఆమెను ప్రధానోపాధ్యాయుడు మెరుగు శ్రీనివాస్, గైడ్ టీచర్ పద్మ అభినందించారు.

సెల్ ఫోన్ అప్పగింత

టేకులపల్లి, డిసెంబర్ 18: మండలంలోని బర్లగూడెం గ్రామస్తుడు పెనక శాంతారావుకు చెందిన సెల్ ఫోన్ ఈ నెల 12న పోయింది. ఆయన వెంటనే బోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా ఆ ఫోన్‌ను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. దానిని శాంతారావుకు పోలీస్ స్టేషన్‌లో బుధవారం అప్పగించారు.

కేటీపీఎస్ ఇంజినీర్స్ జేఏసీ సమావేశం

పాల్వంచ, డిసెంబర్ 18: నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిప్ అండ్ ఇంజినీర్స్ పిలుపు మేరకు తెలంగాణ స్టేట్ పవర్ జేఏసీ (కేటీపీఎస్) సమావేశం స్థానిక కేటీపీఎస్ ఇంజినీర్స్ హాల్‌లో బుధవారం జరిగింది. నాయకులు ఉమామహేశ్వరరావు, యాస్మిన్, రాజేందర్, రాధాకృష్ణ, డోలి శ్రీనివాసరావు, వెంకట్, వెంకటేశ్వర్లు, మంగీలాల్, మహేష్, సీతారాంరెడ్డి, గిరిధర్, శ్రీనివాసరెడ్డి, మల్సూర్, రవీందర్, వరకోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెల్ బేబీ షో

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 18: సింగరేణి దినోత్సవంలో భాగంగా బుధవారం 24 ఏరియా కమ్యూనిటీ హాల్‌లో ఎంవీటీసీ, ఏరియా ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో బుధవారం వెల్ బేబీ షో కార్యక్రమాన్ని ఇల్లెందు ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు వీసం రమ ప్రారంభించారు. ఈ నెల 23న జేకే కాలనీలోని బ్లాక్ డైమండ్ స్టేడియంలో సింగరేణి దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆసుపత్రి డాక్టర్ శారద, ఎంవీటీసీ మేనేజర్ మహేష్, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ సోషల్ ఆడిట్

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 18: ఇల్లెందులో ఈజీఎస్ కార్యాలయంలో బుధవారం సోషల్ ఆడిట్‌ను అధికారులు నిర్వహించారు. ఇల్లెందు మండలంలో ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు జరిగిన పనుల సోషల్ ఆడిట్‌ను మహబూబ్‌నగర్ జిల్లా అధికారి చెన్నకేశవులు తనిఖీ చేశారు. ఏపీవో శంకర్, బీఆర్‌పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చంద్రుగొండ, డిసెంబర్ 18: చంద్రుగొండ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార శాఖాధికారి ఖుర్షీద్‌తో కలిసి గుంపెన సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు బుధవారం ప్రారంభించారు. తహసీల్దార్ సంధ్యారాణి, సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, కార్యదర్శి సున్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు ఎస్సైగా రవి

జూలూరుపాడు, డిసెంబర్ 18: జూలూరుపాడు ఎస్సైగా బదావత్ రవి బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడి రాణాప్రతాప్‌పై సస్పెండయ్యారు. దీంతో ఖమ్మం టూ టౌన్ ఎస్సై బదావత్ రవి ఇక్కడకు వచ్చారు.

నియామక పత్రాలు అందజేత

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 18: వార్డు ఆఫీసర్లుగా ఎంపికైన వారిలో 50 మందిని కొత్తగూడెం మున్సిపాలిటీకి ప్రభుత్వం కేటాయించింది. వారిలో 30 మంది బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శేషాంజన్ స్వామికి రిపోర్ట్ చేసి, నియామక పత్రాలు అందుకున్నారు.

సింగరేణి ఉద్యోగినులకు క్రీడాపోటీలు

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 18: సింగరేణి దినోత్సవంలో భాగంగా ఉద్యోగినులకు బుధవారం క్రీడాపోటీలను సేవా సమితి నిర్వహించింది. విజేతలకు బహుమతులను ఈ నెల 23న సింగరేణి దినోత్సవంలో ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ప్రదానం చేస్తారు.

గ్యాస్ సిలిండర్ అందజేత

జూలూరుపాడు, డిసెంబర్ 18: మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం తయారీ కోసం గ్యాస్ స్టౌవ్‌ను, సిలిండర్‌ను, రెగ్యులేటర్‌ను పూర్వ విద్యార్థి కొర్రా రమేష్ (గ్యాస్ డీలర్) బుధవారం ప్రధానోపాధ్యాయుడు సంజీవరావుకు అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శంకర్, రమేష్, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, డిసెంబర్ 18: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల నిత్యకల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బౌంటి లెవల్ క్రికెట్ టోర్నమెంట్

భద్రాచలం, డిసెంబర్ 18: పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడామైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బౌంటి లెవల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ముగింపు క్రీడల్లో భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, నిర్వాహకులు ఏజెన్సీలో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు.

రామయ్యను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ

భద్రాచలం, డిసెంబర్ 18: భద్రాచలం సీతారామచంద్రస్వామిని మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కమిషన్ సభ్యులు, ఆలిండియా బంజారా సేవాసంఘం అధ్యక్షుడు సభావత్ రాములునాయక్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు

బూర్గంపహాడ్, డిసెంబర్ 18: మండల పరిధిలోని సారపాకకు చెందిన ఒక హృదయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణలో భాగంగా క్యాన్సర్‌పై గ్రామగ్రామాన అవగాహన కల్పిస్తుంది. బుధవారం సారపాకతో పాటు పలు గ్రామాల్లో క్యాన్సర్‌పై సంస్థ నిర్వాహకులు మిట్టకంటి సంజీవరెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. హైమావతి, విజయకుమారి, వీరాస్వామి, వెంకటేశ్వర్లు, సుజాత, కల్యాణి, లక్ష్మి, ప్రసన్న, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర పనులకు శ్రీకారం

దుమ్ముగూడెం, డిసెంబర్ 18: దుమ్ముగూడెం గ్రామంలో పవిత్ర గోదావరి నదీ తీరాన కొలువైన ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 9.05 గంటలకు ఆలయ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి దంపతులు, కమిటీ సభ్యుల సమక్షంలో జాతర పనులను వైభవంగా ప్రారంభించారు. వేదపండితులు కొంపెల్లి సత్యనారాయణచే పూజా కార్యక్రమాలు చేశారు.

పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ

మణుగూరు టౌన్, డిసెంబర్ 18: మణుగూరు పట్టణంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌కుమార్, ఎస్సైలు మేడా ప్రసాద్, రంజిత్ మాట్లాడుతూ.. నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుమానితులు ఉంటే వెంటనే వారి వివరాలను పోలీసులకు చెప్పాలని, ప్రజలు బాధ్యతగా పోలీసులకు సహకారాలు అందించాలన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

మణుగూరు టౌన్, డిసెంబర్ 18: ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మణుగూరు పట్టణంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఓటు వజ్రాయుధం అని, ఓటు హక్కులపై ప్రజల్లో మరింత చైతన్యం రావాలన్నారు.

వలస ఆదివాసీలకు దోమతెరల పంపిణీ

పినపాక, డిసెంబర్ 18: మండలంలోని పిట్టతోగు వలస ఆదివాసీ గ్రామస్తులకు ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ సంస్థ పంపించిన దోమతెరలను బుధవారం ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఎస్సై రాజ్‌కుమార్ ప్రాణిక్ హీలింగ్ సంస్థ సభ్యులు సోంద్‌పాషా, షేక్ వసీం, అక్రమ్ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో 'బ్రిలియంట్' విద్యార్థుల ప్రతిభ

బూర్గంపహాడ్, డిసెంబర్ 18: ఎస్ఆర్ఎఫ్ ఒలింపియాడ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో సారపాక బ్రిలియంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రెండవ రౌండ్‌కు ఎంపికైనట్లు బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ బుధవారం తెలిపారు. నవంబర్ 12న నిర్వహించిన పరీక్షలో మొదటి రౌండ్ ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

అక్రమ కందకాల పూడ్చివేత

అశ్వాపురం, డిసెంబర్ 18: వేములూరు గ్రామంలో గిరిజనుల పోడు భూముల చుట్టూ ఫారెస్టు అధికారులు తవ్విన కందకాలను వ్యతిరేకిస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కందకాలు తీసిన ప్రాంతానికి వెళ్లి సీపీఎం పార్టీ గిరిజన సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పోడు రైతులతో కలిసి కందకాలు పూడ్చివేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

దుమ్ముగూడెం, డిసెంబర్ 18: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలకు పురుగుమందు తాగించి తాను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని డబ్ల్యూఎల్ రేగుబల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రేగుబల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో మనస్థాపం చెంది ఎవరూ లేని సమయంలో ఇద్దరు పిల్లలకు కలుపు మందు తాగించి అనంతరం ఆమె కూడా తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారిని నర్సాపురం పీహెచ్‌సీకి అక్కడ నుంచి 108 వాహనంలో భద్రాచలం ప్రైవేటు వైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బూర్గంపహాడ్, డిసెంబర్ 18: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మండల పరిధిలోని సంజీవరెడ్డిపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. అదనపు ఎస్సై నాగభిక్షం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన బూర్గంపహాడ్ గౌతంపురం గ్రామానికి చెందిన మారబోయిన రమేష్(40) మంగళవారం రాత్రి బీడీల కోసమని ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం ట్రాక్టర్ డ్రైవర్ జంపన్న అటుగా వస్తుండగా సంజీవరెడ్డిపాలెం గ్రామ శివారులో పొదల్లో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. అదనపు ఎస్సై నాగభిక్షం సిబ్బందితో వెళ్లి మృతుడి వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో పొదల్లో గాయాలతో మృతదేహం పడి ఉండడంతో అనుమానం వ్యక్తం చేస్తూ మృతుని భార్య గంగ బుధవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

మైనార్టీలు కుట్టుమిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

భద్రాచలం, డిసెంబర్ 18: ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అందిస్తున్న ఉచిత కుట్టుమిషన్ల కోసం జిల్లాలోని మైనార్టీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా తెలిపారు. బుధవారం భద్రాచలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే 18 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగి ఆధార్, ఓటరు ఐడీ, 5వ తరగతి కనీస విద్యార్హత, ఆహారభద్రత కార్డు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 8520860785, 9866151150ను సంప్రదించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కుర్రి

మణుగూరు టౌన్, డిసెంబర్ 18: మణుగూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మణుగూరు సొసైటీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు బుధవారం సందర్శించారు. రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటామని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆళ్లపల్లి, డిసెంబర్ 18: సమగ్ర శిక్ష, కేజీబీవీలో పని చేస్తున్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు రామాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అనంతరం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జోగ రాంబాబు, బిక్షయ్య, లాలయ్య పాల్గొన్నారు.